
ఆంధ్రజ్యోతి
****
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 16 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.69 (305.8626)	50,685	50,685
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.73 (4.13)	5,331.27	6,019.17
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.061)	37,597	32,751

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240



ఎంజీయూలో పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్, తదితరులు



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎంజీయూ జాతీయ స్థాయికి ఎదగాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అట్టహాసంగా ఎంజీయూ నాలుగో స్నాతకోత్సవం
- 22మందికి పీహెచ్‌డీ, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ జాతీయస్థాయి విద్యాసంస్థగా ఎదగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో 22 మందికి పీహెచ్‌డీ పట్టాలను, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ఛాన్స్‌లర్ హోదాలో గవర్నర్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యా సంస్థలను కేవలం నిర్మాణాలుగా చూడవద్దని, సమాజంలో విలువలు, శ్రేష్ఠత కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా రూపొందించిన జీవన వ్యవస్థలుగా చూడాలన్నారు. అకడమిక్, పరిశోధనలు, ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ మంచి ఫలితాలు సాధిస్తోందని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి యూనివర్సిటీ తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. చాలామంది తొలితరం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఇక్కడికి పలు సవాళ్ల నడుమ వచ్చి ఉంటారని, విద్యార్థులందరినీ అక్కున చేర్చుకొని వారి జీవన ఎదుగుదలకు యూనివర్సిటీ వేదికగా నిలుస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతూ వారేంటో నిరూపించుకుంటూ దేశానికి చక్కటి వనరుగా మారుతున్నారని కొనియాడారు. విద్యార్థుల హాజరుశాతం పెంచడం, మెరుగైన హాస్టళ్ల సదుపాయాలు కల్పించడం, క్యాంపస్‌లో లైబ్రరీ, స్పోర్ట్స్ విభాగాలు అందుబాటులో ఉంచి సమాజానికి ఉపయుక్తమైన విద్యార్థులను అందించడానికి తోడ్పడుతున్న యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది ప్రశంసనీయులని అన్నారు. ఎంజీయూను మరింతగా బలోపేతం చేసేందుకు, జాతీయస్థాయి విద్యాసంస్థగా

- మిగతా 7వ పేజీలో...



తెల్ల బంగారంపై ఆశలు ఆవిరి

జిల్లాలో జూన్, జూలైలో వర్షాలు కురియకపోవడంతో బెంగపెట్టుకున్న రైతులు ఆ తరువాత ఆగస్టు మొదటి వారంలో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తారు. అవి మొలకెత్తి ఏపుగా పెరగడంతో ఆనందపడ్డారు. అయితే తెగుళ్ల ఉధృతి కారణంగా తెల్లబంగారంపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా? రావా? అనే ఆందోళనలో రైతులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- పత్తి చేలల్లో తామర, ఎర్రనల్లి తెగుళ్ల ఉధృతి
- రసం పీల్చే పురుగులతో దిగుబడులపై ప్రభావం
- పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా? అనే సందిగ్ధం
- ఆందోళనకు గురవుతున్న పత్తి రైతులు

ఎకరానికి దుక్కులు దున్నడం మొదలు విత్తనాలు, ఎరువులు, కూలీలు, మొత్తం కలిపి రూ.25వేలకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాలు ఆలస్యంగా కురియడంతో విత్తనాలు ఆలస్యంగా విత్తిన రైతులు పత్తిచేల ఎదుగుదలను చూసి దిగుబడులకు ఢోకా లేదని భావించారు. దీనికి తోడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అతి వృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధికంగా ముసురుతో కూడిన వర్షాలే ఉండటంతో పెద్దగా ప్రయోజనం లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఈనెల 15 వరకు సాధారణ వర్షపాతం 404.8మి.మీలకు 496.5మి.మీల వర్షం కురిసింది. 23మి.మీలు అధికంగానే వర్షపాతం నమోదైనా ముసురు కారణంగా పెద్దగా ప్రయోజనం కలగలేదు. జిల్లాలోని 33 మండలాలకు 14 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని అధికారులు లెక్కలు చెబుతుండగా, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతమే ఉంది. జిల్లా యూనిట్‌గా 23మి.మీలు అధిక వర్షపాతం నమోదైందని లెక్కలు చెబుతుండగా, గ్రామాల వారీగా లెక్కల నమోదుకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పరికరాలు లేక మండలాలు యూనిట్లుగా తీసుకుంటున్నారు. దీంతో క్షేత్రస్థాయి భిన్న పరిస్థితులు కన్పిస్తున్నాయి.

5.68లక్షల ఎకరాల్లో పత్తి విస్తీర్ణం

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.68లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది 20వేల ఎకరాల్లో అదనంగా సాగైంది. వేసవి దుక్కుల్లో వేసిన విత్తనాలు మే నెలలో విత్తగా, చాలా చోట్ల వర్షాలు లేక మొలకెత్తలేదు. ఆ తరువాత జూన్, జూలైలో అడపాదడపా కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తినా, తీరా వర్షాలు రాక కొందరు రైతులు మూడుసార్లు విత్తనాలు విత్తి రైతులు నష్టపోయారు. అయితే ఆగస్టులో కురిసిన వర్షాలకు మాత్రం మొక్కలు నిలదొక్కుకొని బయటపడ్డాయి. అయితే ఎరువులను పెద్ద మొత్తంలో వినియోగించడంతో పత్తిచేలు ఏపుగా పెరిగాయి. వాస్తవానికి పంట దిగుబడి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి వస్తే రైతులకు లాభాలు వస్తాయి. కానీ ప్రస్తుతం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. తొలుత మునుగోడు

- మిగతా 8వ పేజీలో...

పత్తికి ఎర్ర గుమ్మడి తెగులు

(ఆంధ్రజ్యోతి, మర్రిగూడ): మర్రిగూడ మండలంలో ఈ సీజన్‌లో రైతులు 21,800 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. పంట ఏపుగా పెరిగి చెట్టుకు 25 నుంచి 35 వరకు గూడ (కాయ) వచ్చింది. అయితే ఆగస్టు మాసంలో స్వల్ప వర్షాలు కురిసినా, తీవ్ర ఎండల కారణంగా పత్తిని ఎర్ర గుమ్మడి తెగులుకు ఆశించింది. మండలంలోని తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి, అజిలాపురం, ఎర్రగండ్లపల్లి, మర్రిగూడ, రామ్‌రెడ్డిపల్లి, బట్లపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో 9వేల ఎకరాల వరకు పత్తి ఎండిపోయింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పత్తి ఎదిగినప్పటికీ అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల పురుగు చావకుండా ఎదగడంతో ఎర్ర గుమ్మడి తెగులు వ్యాపించిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతులను రెచ్చగొడుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులను బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాపై బీఆర్‌ఎస్ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియాను పక్కదారి పట్టించినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించలేదని స్పష్టం చేశారు. కుక్కడం రైతుల అవసరం మేరకు అక్కడికి ఎక్కువ యూరియా సరఫరా చేశారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా కేటీఆర్ దీనిపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 15 రోజుల క్రితం జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తుందన్నారు. దీనిపై తాము కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం లేదని, బీజేపీ నాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో 5.68లక్షల ఎకరాల్లో పత్తి, 5.38 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, గతం కంటే పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. గత ఏడాది జిల్లాలో 57వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా, ఈసారి ఇప్పటివరకు 61 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లాకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా అవుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో నల్లగొండ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, వంగాల అనిల్‌రెడ్డి, గాలి నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, గాదరి రవి, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలికిన బీజేపీ నాయకులు



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శాలువాలతో సత్కరించారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గూడూరి నారాయణరెడ్డి, ఫకీరు మోహన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, పోతపాక లింగస్వామి, బండారు ప్రసాద్, గడ్డం మహేష్, మిర్యాల వెంకటేశం, బొజ్జ నాగరాజు, బోగరి అనిల్‌కుమార్, పిన్నింటి నరేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

క్రెడాయి రాష్ట్ర కార్యదర్శి బండారు



ఇంజనీర్లను సన్మానిస్తున్న బండారు ప్రసాద్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని క్రెడాయి రాష్ట్ర కార్యదర్శి బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మోక్షగుండ విశ్వేశరయ్య జయంతి సందర్భంగా నల్లగొండ క్రెడాయి చాప్టర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంజనీర్లు నైపుణ్యంతో కట్టిన ప్రాజెక్టులు, భవనాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ఎదురైన క్లిష్ట సమస్యల పరిష్కారానికి ఇంజనీర్లు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా నల్లగొండ మునిసిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఈఈ వెంకటేశ్వర్లు, నాంపల్లి మనోహర్, దిలీప్ భార్గవ్, ఎం.రామరావు, అల్లి మల్లికార్జున్, ఆవుల శ్రీనివాస్, పృథ్వీరాజ్, బొడ్డుపల్లి సతీష్, అలుగుబెల్లి వేణుగోపాల్, మిట్టపల్లి సాయి సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆమంచి రాజలింగం, దూదిపాల వెంకట్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో: జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

రోడ్డెక్కిన రైతులు



పెద్దవూరలో జాతీయ రహదారి ధర్నా చేస్తున్న రైతులు

పెద్దవూర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు సరిపడా యూరియా సరఫరాచేయాలని రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద రైతులు పాస్‌పుస్తకాలు ఉంచి రోజులుగా ఎదురు చూసినా యూరియా దొరక్కపోవడంతో రైతులు సోమవారం కోదాడ-జడ్చర్ల రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, యూరియా కోసం రోజుల కొద్దీ ఎదురుచూస్తున్నామని, పాస్‌పుస్తకాలు క్యూలైన్‌లో ఉంచి పడిగాపులు కాసినా సోమవారం కొంతమంది రైతులకే యూరియా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వై.ప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో వారు శాంతించి ధర్నాను విరమించారు.

కేతేపల్లిలో తోపులాట

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు కీలక దశలో ఉండగా, మండలానికి 10 రోజులుగా యూరియా సరఫరా లేకుండా పోయింది. ఈ క్రమంలో సోమవారం స్థానిక పీఏసీఎస్‌కు మూడు లారీల్లో 1200 బస్తాల యూరియా వచ్చిందని తెలిసిన రైతులు పెద్ద సంఖ్యలో ఉదయాన్నే చేరుకున్నారు. పీఏసీఎస్ కార్యాలయం ఎదుట క్యూలో నిల్చున్నారు. రైతులు అధిక సంఖ్యలో రావడంతో మండల కేంద్రానికి చెందిన రైతులకు ఈ దఫా యూరియా ఇచ్చేందుకు పీఏసీఎస్ అధికారులు నిరాకరించారు. దీంతో క్యూలైన్‌లో కొంతసేపు తోపులాట జరగడంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పాస్‌పుస్తకాల ఆధారంగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయించారు. రైతుల అవసరాలు తీరాలంటే మరో మూడు నుంచి నాలుగు లోడ్ల యూరియా అవసరమని పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్

చండూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు చండూరులో రెండో రోజు సోమవారం కొనసాగాయి. 'మతం-మతోన్మాదం' అనే అంశంపై రమేష్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాల పేరుతో ప్రజల్లో చిచ్చులు పెడుతున్నారని ఆరోపించారు. విద్యారంగం కాషాయికరణ, మతోన్మాద బీజాలు నాటుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ కార్పొరేట్‌కు అప్పగించేందుకు కంకణం కట్టుకున్నాయన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువును అందని ద్రాక్షలా మారుస్తున్నారని విమర్శించారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ 'సోషలిజం విశిష్టత-వాటి ఆవశ్యకత' అనే అంశంపై ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ బాటలో నడుస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్, నవదీప్, జగన్‌నాయక్, జగదీష్, వీరన్న, ప్రసన్న, ప్రణీత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలి

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి సుధాకర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై యువతలో అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్ అన్నారు. యూత్ ఫెస్ట్-2025లో భాగంగా సోమవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ డైట్ కళాశాలలో జిల్లా స్థాయి క్విజ్ నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఉమ్మడి జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ సంపతయ్య, ప్రేమనాథ్, లింగస్వామి పర్యవేక్షించారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన చర్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు, ద్వితీయస్థానంలో నిలిచిన ఆర్పీరోడ్ జీజీహెచ్‌ఎస్ పాఠశాలల విద్యార్థులకు డీఈవో కార్యాలయ సిబ్బంది బాల బహుమతులు అందజేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ



వంగమర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

శాలిగౌరారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో చెరువులు అలుగులు పోస్తుండటంతో మూసీ నదికి భారీగా వరద వస్తోంది. దీంతో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఉప్పలంచ, మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల సరిహద్దు నుంచి మూసీ ఉధృతంగా ప్రవహిస్తూ జలాశయంలో కలుస్తోంది.

పేదింటి బిడ్డకు ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్



దత్తప్పగూడెంలో లావణ్యను సన్మానించి అభినందిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

పట్టుదల ఉంటే చదువుకు పేదిరికం అడ్డుకాదని యాదాద్రి భువనగిరి జిల్లా దత్తప్పగూడెం గ్రామానికి చెందిన వల్లపు లావణ్య నిరూపించింది. సామాన్య రైతు దంపతులైన వల్లపు ధనమ్మ-వెంకన్నలు ఎన్నిఇబ్బందులు ఎదురైనా పిల్లలను చదివించి ఉన్నతస్థాయికి చేర్చాలనుకుని కష్టపడి ఇద్దరు పిల్లలను చదివించారు. కుమారుడు పాలిటెక్నిక్‌తో ఆగిపోగా, కుమార్తె లావణ్య ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. లావణ్య 4వతరగతి వరకు దత్తప్పగూడెం ప్రాథమిక పాఠశాలలో,ఐదు నుంచి పదోతరగతి వరకు రామన్నపేట మండలం జనంపల్లి బాలికల గురుకుల పాఠశాలలో, పాలిటెక్నిక్ హైదరాబాద్‌లోని నాంపల్లి కమలానెహ్రూ బాలికల కళాశాలలో, బీటెక్(సివిల్) మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో చదివింది. పదో తరగతిలో 10/10 జీపీఏ మార్కులు, పాలిటెక్నిక్‌లోనూ 10/10 జీపీఏ మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఇం జనీరింగ్ (సివిల్ గ్రూపు)లో ఉస్మానియా యూనివర్సిటీ నుం చి గోల్డ్‌మెడల్ సాధించి తల్లిదండ్రుల కలలు నెరవేర్చింది. బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శశికాంత్ నుంచి ఇటీవ ల బంగారుపతకం అందుకుంది. గ్రామం నుంచి ఇంజనీరింగ్ లో బంగారం పతకం సాధించిన తొలి విద్యార్థినిగా నిలిచిన ఆమెను గ్రామస్థులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి, పార్టీ నాయకులతో వేర్వేరుగా సన్మానించారు. లావణ్య బంగారు పతకం సాధించడం తమ గ్రామానికే కాకుండా ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. అభినందించిన వారిలో మాజీ సర్పంచ్ ఎలుగు శోభసోమయ్య, నాయకులు గంగుమల్లు, ఉదమ్, స్వామి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తెప్పాల రాయప్ప, గుండు యాదగిరి, గ్రామ ఎంప్లాయిస్ క్లబ్ కార్యదర్శి వల్లపు బిక్షం, యాదవసంఘం అధ్యక్షుడు ఎలుగు యాదయ్య పాల్గొన్నారు.

అలుపెరగని పరుగు

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వేదవతికి చదువుకునే రోజుల నుంచే పరుగుపందెం అంటే మక్కువ. పాఠశాల స్థాయిలోనే రాష్ట్రస్థాయి పతకాలు సాధించారు. క్రీడాకారుల కోటాలోనే ఉద్యోగం సాధించింది. అయినా జాతీయస్థాయిలో పతకం సాధించాలన్న ఆమె తపన పోలేదు. ఇటీవల అన్నిస్థాయిల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పరుగుపందెలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బంగారు పతకమే లక్ష్యంగా సిద్ధమవుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)



వేదవతిని సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణమోహన్(ఫైల్)

- ప్రభుత్వ ఉద్యోగుల పోటీల్లో రాష్ట్రస్థాయి బంగారు పతకం
- జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు ఎంపికైన వేదవతి
- పాఠశాల వయసులోనూ గోల్డ్‌మెడల్

మహబూబ్‌నగర్ జిల్లా మాడుగుల మండలం సుద్దపల్లికి చెందిన రైతు దేవరకొండ రామచంద్రయ్య, వెంకటమ్మ ఆరుగురు కుమార్తెల్లో చిన్నకుమార్తె దేవరకొండ వేదవతి. చిన్నతనం నుంచి చదువన్నా, ఆటలన్నా ఆమెకు మక్కువ. స్వగ్రామంలోనే ఐదవ తరగతికి వరకు విద్యనభ్యసించింది. అనంతరం ఆరవ తరగతి చదివేందుకు అక్కడ పాఠశాల లేకపోవడంతో ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ఉన్నత పాఠశాలలో చేరింది. ప్రతిరోజూ తనకు అన్న వరుసయ్యే పెదనాన్న కుమారుడితో కలిసి చింతపల్లికి వచ్చి పోతుండేది. ఎలాగైనా మంచి క్రీడాకారిని కావాలనే తలంపుతో చదువుతో పాటు పరుగు పందెంలో రాణించడం ప్రారంభించింది. పీఈటీ మారయ్య వేదవతిలోని క్రీడాసక్తిని గుర్తించి ఆమెకు తర్ఫీదునిచ్చారు. 9వ తరగతి చదువతున్నప్పుడు(1992-93) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పరుగుపందెలో 3 వేల మీటర్లను కేవలం 11 నిమిషాల 40 సెకన్లలో పూర్తిచేసి గోల్డ్‌మెల్ సాధించింది. ఈ పతకంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగుల పందెంలో పాల్గొంది. అనంతరం ఆమె క్రీడాకారుల కోటాలో పీఈటీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించింది.

2023లో నిర్వహించిన ప్రభుత్వఉద్యోగుల(సివిల్ సర్వీసెస్)క్రీడాపోటీల్లో 100మీటర్ల పరుగుపందెంలో 19 సెకన్లలోనే పూర్తిచేసి గోల్డ్‌మెడల్ అందుకుంది. ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగంలో పదోన్నతి పొందింది. అనంతరం నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని మంత్రి జగదీశ్‌రెడ్డి నుంచి ఉత్తమ ప్రశంసాపత్రాలు, షీల్డ్‌ను అందుకున్నారు.

తాజాగా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్(2025-26)లో 100 పరుగుల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ ఏడాది డిసెంబరులో డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైంది.

జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ లక్ష్యం



పరుగుపందెంలో జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడమే నా లక్ష్యం. భర్త వెంకటేష్ ప్రోత్సాహంతో ఫిజికల్ డైరెక్టర్‌గా, క్రీడాకారిణిగా ముందుకు సాగుతున్నా. పరుగుపందెలో రాణించి రాష్ట్రానికి పేరుతెస్తా.

- వేదవతి, ఫిజికల్ డైరెక్టర్, మర్రిగూడ ఉన్నత పాఠశాల

30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న డీటీ రఘునందన్

నాంపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం నర్సింహులగూడెంలోని రైస్‌మిల్లులో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ యాచన రఘునందన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం నర్సింహులగూడెం నాగార్జున రైస్‌మిల్లులో కొద్దిరోజులుగా రేషన్‌బియ్యాన్ని సేకరించి నూకలుగా మార్చి అక్రమ వ్యాపారం చేస్తున్నారని సమాచారం అందింది. సోమవారం తనిఖీలు నిర్వహించగా 60 బస్తాల్లో నిల్వ చేసిన 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించారు. వెంటనే స్వాధీనం చేసుకొని మిల్లును సీజ్ చేసినట్లు ఆర్ఐ తెలిపారు. మిల్లులో ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం, సంబంధించిన పత్రాలు లేకపోవడంతో అనుమానం వచ్చి మిల్లును తనిఖీ చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యం నిల్వ ఉండడంతో సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రేషన్‌బియ్యాన్ని విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీ పట్టివేత

గరిడేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ధాన్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మండపేటకు ధాన్యం లోడుతో లారీ వెళ్తోంది. సాధారణ వాహన తనిఖీలు చేపట్టిన గరిడేపల్లి పోలీసులు ధాన్యం లారీని పరిశీలించారు. ప్రభుత్వ ముద్రణతో ఉన్న సంచుల్లో ధాన్యం ఉండటం అనుమతి పత్రాలు లేకపోవడవంతో లారీని స్వాధీనం చేసుకుని, సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. సివిల్ సప్లయ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో పడి పశువుల కాపరి మృతి



సైదమ్మ మృతదేహం

చింతలపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో పడి పశువుల కాపరి మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింతిర్యాల గ్రామంలో జరిగింది. ఎస్‌హెచ్‌వో వెంకయ్య, బంధువులు వివరాల ప్రకారం చింతిర్యాల గ్రామానికి చెందిన బడుగుల సైదమ్మ(54) రోజు వారి పనిలో భాగంగా ఆదివారం పశువుల మేత కోసం కృష్ణానది పరివాహక ప్రాంతానికి వెళ్లింది. పశువులు నదిలోనికి వెళ్లడంతో ఆమె వాటిని బయటకు తోలే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నది నీటిలో మునిగిపోయింది. ఇంటికి రాకపోవడంతో రాత్రి వరకు కుటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించలేదు. దీంతో సైదమ్మ కుమారుడు గోపిరాజు ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్‌హెచ్‌వో తన సిబ్బందితో స్థానిక యువకులతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం నదిలో సైదమ్మ మృతదేహం లభ్యమైంది. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కుమారుడు గోపిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెంకయ్య తెలిపారు.

ఆర్యవైశ్యులకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలి



సీఎంకు పోస్ట్ చేస్తున్న నాగరాజు

మర్రిగూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈడబ్ల్యూఎస్ కోటా 10 శాతం రిజర్వేషన్‌లో ఏబీసీ వర్గీకరణ చేసి ఆర్యవైశ్యులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరుగు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల పేదలకు ఇస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కింద విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలన్నారు. ఇందుకోసం వర్గీకరణ చేపట్టాలన్నారు. ఆర్యవైశ్యుల జనాభా దామాషా ప్రకారం ప్రత్యేకంగా నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

హన్యానాయక్‌కు గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



గ్లోబల్‌ఎక్స్‌లెన్స్ అవార్డుతో హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సోషల్ వర్కర్ ధీరావత్ హన్యానాయక్ గ్లోబల్ ఎక్స్‌లెన్సీ అవార్డును అందుకున్నారు. విద్య, వైద్య, సామాజిక విభాగాలలో అందిస్తున్న సేవలకు గుర్తించిన పాల్ నారులా అకాడమీ హన్యానాయక్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. బ్యాంకాక్ రాజధాని థాయ్‌లాండ్‌లో ఆదివారం రాత్రి జీస్ప్యైర్ యూనివర్సల్ బిజినెస్ సమ్మిట్‌లో అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. తన సేవలను విస్తృత పరుస్తానని, మరింత బాధ్యతతో పనిచేస్తానన్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

రాజాపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బొందుగుల ఉన్నత పాఠశాల ఆవరణలో క్షుద్రపూజల ప్రచారం సోమవారం కలకలం రేపింది. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోని స్టేజీపై ముగ్గును వేసి ఇతర సామాగ్రి ఉంచారు. దీంతో సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు చూసి ఆందోళన చెందారు. ఈ ఘటనపై ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆకతాయిల పని అయి ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

గవర్నర్ రాక నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంజీ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరవుతున్న నేపథ్యంలో యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు వాడపల్లి నవీన్‌ను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఎంజీయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల పేరిట ఫీజులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హోదాలో వస్తున్న గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తామని కాలేజీ యాజమాన్యానికి నవీన్ విజ్ఞాపన చేశారు. దీంతో పోలీసులు ముందస్తుగా నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్నను కూడా ముందస్తు అరెస్టు చేశారు.

బాలికపై లైంగికదాడి కేసులో 21ఏళ్ల జైలు

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం తీర్పునిచ్చింది. సోమవారం నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎన్.రోజారమణి ఈ మేరకు తీర్పు ప్రకటించారు. కేసు వివరాల్లోకి వెళితే చిట్యాల మండలం వనిపాకలకు చెందిన దోమల రాములు 2018సంవత్సరం ఫిబ్రవరి 1వ తేదీన మద్యం మత్తులో గ్రామంలోని ఓ ఇంట్లో టీవీ చూస్తోన్న బాలికను బెదిరించి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలిక తొలుత ఎవరికీ చెప్పకుండా తనలో తాను మదనపడింది. బాలిక ప్రవర్తనలో మార్పు గమనించి తల్లిదండ్రులు ఆరా తీయగా తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని తెలియజేసింది. దీంతో బాలిక తండ్రి అదే ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్లు 448, 506, 376 (2)(ఐ) కింద, పోక్సో చట్టం -2012 సెక్షన్లు 5(ఎం), 6 కింద కేసు నమోదు చేసిన చిట్యాల పోలీసులు దర్యాప్తు నిర్వహించి, నిందితుడు లైంగికదాడి చేసిన విషయాన్ని సరైన ఆధారాలతో కోర్టులో నిరూపించారు. నిందితుడు బాలికను బెదిరించి ఆమెపై లైంగికదాడికి పాల్పడిన విషయం నిరూపితమవడంతో పోక్సో చట్టం 2012 సెక్షన్ 5 (ఎం) కింద సెక్షన్ -6 ప్రకారం 20ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. నిందితుడు బాలిక ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించినందుకు ఐపీసీ సెక్షన్-448 కింద ఏడాది జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. మొత్తం రెండు శిక్షలు కలిపి 21ఏళ్ల జైలుశిక్ష, రూ.30వేల జరిమానా చెల్లించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించినందున నిందితుడు 20 ఏళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అదేవిధంగా బాధితురాలికి ఉపశమనం, పునరావాసం నిమిత్తం జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ద్వారా రూ.10లక్షల పరిహారాన్ని వీలైనంత త్వరగా అందజేయాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదించారు. కేసులో సరైన సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో దాఖలు చేసేందుకు ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అప్పటి సీఐ పాండురంగారెడ్డి, ఎస్ఐ సైదాబాబు, ప్రస్తుత సీఐ కె.నాగరాజు, ఎస్ఐ రవికుమార్, సీడీవో యాదయ్య, భరోసా సెంటర్ లీగల్ అధికారి కల్పన తదితరులను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

తల్లిదండ్రులు మాట్లాడటంలేదని
కుమార్తె ఆత్మహత్య



శ్రీవెన్నెల(ఫైల్)

బీబీనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించి, మాట్లాడడం మానేశారని మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్థులు, సమీప బంధువులు తెలిపిన వివరాల ప్రకారం వెంకిర్యాల గ్రామానికి చెందిన మార్త రమేష్ ఆర్టీసీ డ్రైవర్ కాగా అతడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె మార్త శ్రీవెన్నెల(17) తార్నాకలోని రైల్వే జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. నాలుగు రోజుల కిందట ఇంటికి ఆలస్యంగా రావడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తండ్రి రమేష్ కుమార్తెను తీవ్రస్థాయిలో మందలించారు. అంతేకాకుండా ఇంట్లో ఎవరూ శ్రీవెన్నెలతో సరిగా మాట్లాడడం మానేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో తల్లిదండ్రులు శ్రీవెన్నెలను ఇంట్లోనే ఉంచి మరో కుమార్తె, కుమారుడితో కలిసి ఊరికి వెళ్లారు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి తిరిగి వచ్చి చూడగా శ్రీవెన్నెల ఇంట్లో ఉరి వేసుకుని ఉండటాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోదాడరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుకొని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన చిగురుపాటి రవి, కూచిపూడి గ్రామానికి చెందిన సిరంశెట్టి సాయి ఇసుకను ట్రాక్టర్లలో తీసుకొని కోదాడకు వస్తుండగా దొరకుంట వద్ద పట్టుకొని ఎస్ఐ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

అప్పులు తీర్చేందుకు దొంగగా మారిన కారోబార్



కోదాడ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడిన తల్లిదండ్రులకు వైద్యం నిమిత్తం అప్పులు తీర్చేందుకు ఓ కుమారుడు దొంగగా మారాడు. కారోబార్‌గా పనిచేస్తున్న గ్రామంలోనే ఏడాదిలో మూడు ఇళ్లలో దొంగతనాలు చేశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తులో కారోబార్ విషయం వెలుగుచూసింది. అతడినుంచి రూ.6 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన కొండ భాస్కర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మూడేళ్లుగా కాంట్రాక్ట్ కారోబార్‌గా పనిచేస్తున్నారు. గతేడాది అతడి తల్లిదండ్రులు అనారోగ్యానికి గురై మృతి చెందారు. వారికి వైద్యం చేయించేందుకు రూ.8 లక్షల దాకా భాస్కర్‌కు అప్పులయ్యాయి. వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో వచ్చే జీతం కుటుంబపోషణకే సరిపోవడంతో అప్పులు తీర్చలేకపోయారు. అప్పు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో దొంగతనాలు చేసి అప్పులు తీర్చాలని భావించాడు. అదేగ్రామంలో ఏడాదిలో మూడు ఇళ్లలో పెద్దఎత్తున బంగారం, నగదు, వెండి వస్తువులు, చోరీలకు పాల్పడ్డాడు. గ్రామపంచాయతీలో పనిచేస్తుండటంతో గ్రామస్థుల పూర్తి సమాచారం తెలిసిఉండేది. తాను చోరీకి పాల్పడాలనుకున్న వారు పనుల నిమిత్తం ఊరు దాటిన సమయంలో చోరీలకు పాల్పడేవాడు. బాధితులు పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభించారు. భాస్కర్ చోరీలకు పాల్పడిన క్రమంలో కొన్నినగలు విక్రయించి డబ్బును వినియోగించుకున్నాడు. ఇంట్లో దాచిఉంచిన నగలను సోమవారం కోదాడలోని గోల్డ్ ఫైనాన్స్ కంపెనీలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని విచారించారు. దీంతో ఖానాపురం గ్రామంలో దొంగతనాలకు పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడు. భాస్కర్ నుంచి రూ.6లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.3 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనపర్చుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. భాస్కర్‌ను అరెస్టుచేసి కోదాడ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ ప్రతాపలింగం, ఎస్ఐ నవీన్‌కుమార్, సిబ్బంది రామారావు, నిరంజన్, ఏడుకొండలు నర్సింహారావు, పాల్గొన్నారు.

రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ మార్చాలి





దేవిరెడ్డిగూడెం వద్ద రాస్తారోకో చేస్తున్న భూనిర్వాసితులు, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వలిగొండ రైతులు

సంస్థాన్‌నారాయణపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ త్రిపుల్‌ఆర్ బాధితులు డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం దేవిరెడ్డిగూడెం గ్రామం వద్ద సోమవారం మునుగోడు-చౌటుప్పల్ ప్రధానరహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. భూములు కోల్పోయి నిరాశ్రయులు కావాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని అలాంటి భూముల గుండా రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటుచేస్తే తమ బతుకులు ఛిద్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరి స్వార్థం కోసం చేసిన త్రిపుల్‌ఆర్ అలైన్మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం జరిగేవరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి సమీపంలోని రాయగిరి మీదుగా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం ప్రతిపాదనలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే ఉపసంహరించుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం వలిగొండ మండలం గోకారం, వర్కట్‌పల్లి గ్రామాల రైతులు సోమవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రిపుల్ ఆర్ నిర్మాణంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. చేవెళ్ల కాల్వ, మూసీ కాలువ, గ్యాస్ పైప్‌లైన్‌కు ఇప్పటికే భూములు ఇచ్చామన్నారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందన్నారు. అలైన్మెంట్ మార్చి న్యాయం చేయాలన్నారు.

కార్యక్రమంలో మల్లారెడ్డి, గంగయ్య, రవి, దయాకర్ రెడ్డి, వెంకటేశం, జనార్ధన్ రెడ్డి, రవీందర్, నరేందర్ , సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారంసెంటర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలన్నారు. బోధనా బాధ్యత అంగన్‌వాడీ ఉద్యోగులకు కల్పించాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేస్తూ ఒకే ఆన్‌లైన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయకార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొడిశెట్టి నాగమణి, కార్యదర్శి బొందు పార్వతి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మీ, భువనగిరి జిల్లా కార్యదర్శి రమ, ఉపాధ్యక్షుడు మణెమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీఏ నవీన్‌కుమార్

మాడ్గులపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని అదనపు డీఆర్‌డీఏ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆయన మాట్లాడారు. కూలీలకు కనీస వేతనం తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. 77 పనులకు రూ.3,46,87,348లను ఖర్చు చేశారని, అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సరిగా రికార్డులు పూర్తిచేయని, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి రూ.7వేల జరిమానా విధించామన్నారు. గ్రామస్థాయిలో అన్నిరకాల రిజిస్టర్లను పూర్తిస్థాయిలో ఉంచాలన్నారు. జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ చకిలం వేణుగోపాల్‌రావు, నాణ్యతా పరిశీలనాధికారి ఫసియొద్దీన్, ఎంపీడీవో సంగీత, ఏపీవో నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ చెన్నకేశవ్, ఈసీ బాలునాయక్, సీఏ యాదగిరి, సత్యనారాయణ, శ్రీను, శోభా, సౌజన్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొలనుపాక విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆకుల వేణుగోపాల్

ఆలేరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14వ తేదీన ఆలేరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో ధనుష్, మనోజ్‌కుమార్, కార్తీక్, చండేశ్వర్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆకుల వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి 30 వరకు నిజామాబాద్ జిల్లాలో కొనసాగనున్న 35వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ మాదాను జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతలకు బహుమతులు అందిస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారి పద్మ

కోదాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వసతి గృహ సంక్షేమ అధికారి వంగపల్లి పద్మ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ బాలాజీనగర్‌లో గల ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థులు ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 45 కిలోల విభాగంలో గౌతమి వెండి, 48 కిలోల విభాగంలో లక్ష్మీ ప్రసన్న క్యాంస్య పతకం సాధించారు. వీరిని హాస్టల్‌లో తోటి విద్యార్థుల మధ్య శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఆలోచించే ఇంజనీర్లకు ఉజ్వల భవిత

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే వినూత్న ఆలోచనలు చేసే ఇంజనీర్లకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు అన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం ఇంజనీర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారికి వచ్చే ఆలోచనల్లో ఒకటైనా ఆచరణలోనికి తీసుకురాగలిగితే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇరిగేషన్ బ్లాక్ సిస్టమ్ అనే నూతన విధానాలను తీసుకువచ్చి వ్యర్థమైన నీటిని నిల్వచేసి తిరిగి ఉపయోగించే విధంగా కృషి చేశారని అన్నారు. విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజనీరుగా, ఆర్థికవేత్తగా, నీటి యాజమాన్య నిపుణుడిగా, డ్యాముల నిర్మాతగా, స్టేట్స్‌మెన్‌గా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి దేశాభివృద్ధికి బాటలు వేశారని అన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో

ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల వినూత్న ప్రాజెక్టు ఎక్స్‌పోలు ఆకట్టుకున్నాయి. అత్యుత్తమంగా రూపొందించిన ప్రాజెక్టులకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి విద్యార్థిని మృతి

చిలుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినికి ఓ ఆర్‌ఎంపీ(రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) చేసిన వైద్యం వికటించి బాలిక మృతి చెందింది. సోమవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామానికి చెందిన జానిమియా-సఫియా దంపతుల కుమార్తె సుహానా(13) నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. జ్వరం రావడంతో నాలుగు రోజులుగా బేతవోలులో వైద్యం చేయించారు. సోమవారం వైద్యం చేయించేందుకు ఆర్‌ఎంపీ శ్రీనివాస్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ఇంజక్షన్ ఇచ్చి సెలైన్ బాటిల్ పెట్టి వైద్యం అందిస్తుండగా కొద్దిసేపటికి సుహానా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బాలిక కుటుంబ సభ్యులు వెంటనే కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న సుహానా బంధువులు బేతవోలు, రామాపురం గ్రామాల నుంచి కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలివచ్చారు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్య వైద్యంతోనే బాలిక మృతి చెందినట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండను టీబీ, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజికవేత్తలు కలిసి పనిచేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలతో కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో సోమవారం ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించాలని, వ్యాధి నివారణకు సమాజంలో అన్ని వర్గాలవారినీ భాగస్వాములను చేయాలని సూచించారు. కవులు, కళాకారులు, రచయితలతో వివిధ రంగాల ప్రముఖులను టీబీ ముక్తభారత్‌లో భాగస్వాములను చేయాలన్నారు. ఈ వర్గాలవారందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, టీబీని పూర్తిగా నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గవర్నర్ నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి సూచించారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ సైతం ప్రాధాన్యమిస్తున్నందున, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. సాంఘిక నాటకాలు, పద్యాలు, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని, టీబీకి వ్యతిరేకంగా అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో గంజాయి వినియోగం సైతం అధికంగా ఉందని తెలుస్తోందని, దీన్ని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేయాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ, కలెక్టర్ మొదలుకొని సామాన్య ప్రజల వరకు అందరూ భాగస్వాములై టీబీ, గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లా సాధనకు కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయి లబ్ధిదారులకు అందేలా చూడాలని, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల వారికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని, ఈ విషయంలో ఎంపీ రఘువీర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో వైద్యం, ఆరోగ్యం, విద్య, పోషణ్‌అభియాన్ పథకాలు విజయవంతంగా అమలు చేయడం పట్ల ఆయన కలెక్టర్ నేతృత్వంలోని అధికారయంత్రాంగాన్ని ప్రశంసించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్

జిల్లాలో అమలవుతున్న పలు కేంద్ర, రాష్ట్ర పథకాలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అన్నిపథకాల పూర్తివివరాలు, లబ్ధిదారుల పరిస్థితి, వచ్చిన మార్పులను ఆమె పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమగ్రమైన లెక్కలతో వివరించడంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధరంగాలకు చెందిన ప్రముఖులు రైతు రాంరెడ్డి, సంఘసంస్కర్త మేరీ, పదోతరగతి జిల్లా టాపర్ అమూల్య, ఉత్తమ ఉపాధ్యాయఅవార్డు గ్రహీత కృష్ణకాంత్‌నాయక్, నీటిపోరుదల ఉద్యమకారుడు దుశ్చర్ల సత్యనారాయణ, కవి నగర్ల సత్తయ్య, సామాజిక కార్యకర్త సురేష్‌గుప్తా, మదన్‌మోహన్, డాక్టర్లు పుల్లారావు, జయప్రకాష్ రెడ్డి తదితరులతో గవర్నర్ సంభాషించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఏఎస్పీ మౌనిక, సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్, జిల్లా అటవీశాఖాధికారి రాజశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌తో చర్చిస్తున్న ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

గవర్నర్ సూచనలు స్వీకరించి పనిచేస్తాం : ఎంపీ

గవర్నర్ సూచనల మేరకు జిల్లాలో టీబీ నివారణకు ముఖ్యుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. జిల్లా అధికారయంత్రాంగంతో కలిసి పనిచేస్తూ ఈ మహమ్మారులను తరిమికొడతామని వివరించారు. జిల్లాలో అతిపెద్ద రైస్ ఇండస్ట్రీ ఉందని, దీనివలన వాతావరణ కాలుష్యం, టీబీ వంటి వ్యాధులు సోకేందుకు ఆస్కారం ఉందని, ఈ ప్రాంతంపై దృష్టిసారించి టీబీ నివారణకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో యువత గంజాయి వాడకానికి అలవాటు పడుతున్నారని, దీనిని పూర్తిగా నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


ఎంజీయూ జాతీయ స్థాయికి ఎదగాలి

(5వ పేజీ తరువాయి)

తీర్చిదిద్దేందుకు బలమైన పూర్వవిద్యార్థుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆ నెట్‌వర్క్‌ను యూనివర్సిటీకి అనుసంధానం చేయడం ద్వారా విశ్వవిద్యాలయ పురోగతిని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. న్యాక్ అక్రిడేషన్లు యూనివర్సిటీల గౌరవాన్ని, ఉన్నతిని పెంపొందిస్తాయని, వీటిని సాధించడంలో ఎంజీయూ పురోగతిలో ఉందని పేర్కొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

ఎంజీ యూనివర్సిటీ విద్యార్థులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి అన్నారు. స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థి చదివే సబ్జెక్టులో డిగ్రీతో పాటు, ఇష్టమైన మరో సబ్జెక్టులోనూ డిగ్రీ చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్య విద్యార్థులను ఉత్పాదకత వైపు మళ్లించడమేగాక, దేశాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ యూనివర్సిటీ నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో గవర్నర్ ఏడీసీ భవాని ప్రసాద్, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి దేవసేన, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్, ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, తొలి వీసీ ప్రొఫెసర్ గంగాధర్, మాజీ రిజిస్ట్రార్లు నరేందర్‌రెడ్డి, ఉమేష్‌కుమార్, పరీక్షల నియంత్రణాధికారి ఉపేందర్‌రెడ్డి, యూనివర్సిటీ అధికారులు లక్ష్మీప్రభ, సంధ్యారాణి, ప్రవళిక, ఆకుల రవి, మిర్యాల రమేష్, మద్దిలేటి, ధర్మానాయక్, కొప్పుల అంజిరెడ్డి, రేఖ, తదితరులు పాల్గొన్నారు.



ఎంజీయూలో మొక్క నాటిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

దివ్యక్షేత్రంలో కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట, పాతగుట్ట లక్ష్మీనరసింహుల ఉభయ ఆలయాల్లో కణ్ణన్ (కృష్ణ) తిరునక్షత్రోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం కణ్ణన్ పెరుమాళ్ల, ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం చేపట్టి అద్దాల మండపంలో శ్రీకృష్ణస్వామి వేడుకలు ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రచార్యులు అర్చకబృందంతో చేపట్టారు. సాయంత్రం కణ్ణన్ తిరునక్షత్రోత్సవం చేపట్టిన అర్చకబృందం విశేష భోగ ప్రసాదాలు నివేదించి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దంపతులు పాల్గొనగా తి రిగి బుధవారం (17న) సాయంత్రం ఉట్లోత్సవం అనంతరం ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం నిర్వహిస్తారు. వేడుకల సందర్భంగా సోమవారం ఆలయంలో నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, సుదర్శన నారసింహ హోమం, వివిధ భోగాలు రద్దు చేశారు. వేడుకల్లో ఏఈవో జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు కే.నటరాజు సిబ్బంది పాల్గొన్నారు.

శివకేశవుల విశేష పూజలు

స్వామివారి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేద మంత్ర పఠనాలతో అర్చించారు. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 10,28,686 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.


ప్రాకార మండపంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

రెయిన్ సిమెంట్స్‌కు పర్యావరణ పరిరక్షణ అవార్డు


ఉత్తమ పర్యావరణ అవార్డు అందుకుంటున్న రెయిన్ సిమెంట్స్ ప్రతినిధులు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామంలోని రెయిన్ సిమెంట్స్ సంస్థకు ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు లభించినట్లు సంస్థ యునైటెడ్ హెడ్ సీతారామిరెడ్డి తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో పూణెలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐఐ 12వ జాతీయ ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డులను అందుకున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు వంద కంపెనీలు అవార్డు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వాటిలో రామాపురంలోని రెయిన్ సిమెంట్ సంస్థకు స్మార్ట్ అలర్ట్ సిస్టమ్, వెట్ డ్రిల్లింగ్‌లో పర్యావరణ పరిరక్షణ కోసం, ఘన, ద్రవ జీవామృతం ద్వారా గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి సంస్థ చేసిన కృషిని సంస్థ ప్రతినిధులు ప్రజెంటేషన్ ద్వారా సీఐఐ ప్రతినిధులకు వివరించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు తమ సంస్థ తీసుకుంటున్న చర్యలకు సీఐఐ ప్రతినిధులు ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు అందించినట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు హరిబాబు, విద్యాసాగర్, ధర్మారావు అవార్డు స్వీకరించినట్లు సీతారామిరెడ్డి తెలిపారు

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



మేళ్లచెర్వు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వర ఆలయంలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. సోమవారం ప్రాంతః కాలంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పుష్పార్చన నిర్వహించారు. ఆ సమయంలో శివలింగాన్ని సూర్య కిరణాలు తాకడంతో ఆ దృశ్యాన్ని తిలకిచేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గోపూజ నిర్వహించి, మహానివేదన, మంగళనీరాజనం, మంత్రపుష్పం సమర్పించి స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేసి ఆల య ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగెళ్ల శంభిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

పెరటి తోట.. ఆరోగ్యానికి బాట

ఇటీవల కాలంలో కూరగాయలకు తెగుళ్ల వ్యాప్తి అధికం కావడంతో రసాయనిక ఎరువుల వాడకం బాగా పెరిగింది. ఈ పద్ధతిలో సాగు చేసిన పంటలు త్వరగా పాడైపోవడంతో పాటు ఆరోగ్యానికి చేటు చేస్తాయి. నిత్యం మన వాడే కూరగాయలను మన ఇంటి ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకోవచ్చని నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. పెరటి తోటల సాగు విధానాన్ని వివరించారు.



\- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ, వ్యవసాయం.

ఇంటి ఆవరణలోని ఏ రకమైన స్థలమైనా సమర్థంగా ఉపయోగించుకుని చిన్న సూత్రాలను పాటించి సమీకృత పోషక పదార్థాలను అందజేసే ఐదురకాల కూరగాయలను ఏడాది పొడవునా పండించుకోవచ్చు. ఈ పద్ధతిని బయోఇన్ గార్డెనింగ్ అంటారు. వృక్ష, జంతు (జీవ)సంబంధమైన వివిధ రకాల పదార్థాలను ఉపయోగించి నూరుశాతం సేంద్రియ విధానాలు పాటిస్తారు. సమీకృత పోషక యాజమాన్యం ద్వారా చీడ పీడల వచ్చిన తర్వాత కాకుండా అవి రాక ముందే సస్య రక్షణ పద్ధతులు చేపడతారు.

మడి తయారీ

- ఈ పద్ధతిలో 100 చ.అడుగుల స్థలం. 20అడుగుల పొడవు, 5అడుగుల వెడల్పు ఉండే విధంగా దీర్ఘచతురస్రాకారంలో మడిని ఎంచుకోవాలి.
- ఈ మడిలో రెండు అడుగుల లోతు వరకు రాళ్ల వంటివి లేకుండా చేయాలి. తర్వాత ఆరు తట్టల పశువుల ఎరువు, నాలుగు కిలోల వర్మి కంపోస్టు, నాలుగు కిలోల వేప పిండి, రెండు కిలోల కోడిగుడ్లు, లేదా నత్తగుల్లలు, పావు కిలో కొయ్య బూడిద, రెండు కిలోల సుబాబుల్ రొట్ట, రెండు కిలోల వేపరొట్టను మట్టిలోకలిసే విధంగా కలుపుకోవాలి.
- ఈ పదార్థాలు భూమిలో పోషక విలువలు అందించడంతో పాటు భూమి గుల్లగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వర్మి కంపోస్టు పోషక పదార్థాలతో పాటు హార్మోనులను, మిత్ర సూక్ష్మ జీవులను అందిస్తుంది. నత్తగుల్లలు భూమిని పొడిగా ఉంచుతుంది. బూడిద పోషక పదార్థాలు (పొటాష్, జింకు)అందించడంతో పాటు మడిలో క్రిమీ కీటకాలను నియంత్రిస్తుంది. వేప పచ్చి రొట్టగా ఉపయోగపడుతుంది.

» సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు » ఇంటి ఆవరణలో ఏడాదిపాటు పెంపకం



మంచి ఆరోగ్యం

- ఈ పద్ధతిలో కూరగాయలు పండించుకుని తింటే శరీర పెరుగుదలకు అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, పిండి పదార్థాలు సమీకృత పోషక పదార్థాలు అందుతాయి.

సస్యరక్షణ చర్యలు

- మొక్కల ఆశించు పురుగులను తెగుళ్లను పారదోలడానికి వృక్ష సంబంధ నూనెలు, కషాయాలు, బూడిద వంటి పదార్థాలను ఉపయోగించుకోవాలి.
- వేప, కానుగ, జట్రోపా గింజల నూనెలు, పొగాకు కాడల కషాయం, బంతి కాడల వంటి కషాయాలు, కొయ్య బూడిద తగు పరిమాణంలో నీటితో కలిపి పిచికారి చేసుకోవాలి.
- వేప. కానుగ నూనెను చల్లేటపుడు ముందుగా కొద్ది నీటిలో కుంకుడుకాయల రసం తీసుకుని 100గ్రా. రసంలో 3 మి.లీ నూనెను బాగా కలిపి 900మి.లీ మంచి నీటిలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఆకు మొత్తం తడిచేలా చల్లుకోవాలి.
- బూడిదను ఉదయం పూట ఆకులను అంటుకునేలా పలుచని వస్త్రంలో కట్టుకుని చల్లుకోవాలి.
- కషాయాలను తయారు చేసేటపుడు పావు కిలో బరువు ఉండే ఎండిన బంతి లేదా పొగాకు కాడలను 2 లీటర్ల నీటిలో బాగా మరిగించి కషాయంగా తయారు చేసుకోవాలి. దీనిని వడకట్టి 100-200 మి.లీ ద్రావణానికి 800-900 మి.లీ నీటిని కలుపుకుని మొక్కలపై చల్లుకోవాలి. బాటిల్ ద్వారా జల్లుకోవచ్చు.

కూరగాయల పెంపకం

- మడిని నాలుగు సమాంతర భాగాలుగా తయారు చేసుకోవాలి. ఒక్కో భాగం 25చ.అడుగుల విస్తీర్ణం కలిగి ఉండాలి.
- మొదటి మడిలో ఆకుకూరలు(తోటకూర, మెంతికూర, చుక్క, పాలకూర) వేసుకోవాలి.
- రెండో మడిలో దుంపజాతి (ముల్లంగి, క్యారెట్) నాటుకోవాలి.
- మూడో మడిలో కాయ జాతి (వంగ, బెండ, టోమాటో)నాటుకోవాలి.
- నాలుగో మడిలో చిక్కుడు జాతి (గోరు చిక్కుడు, చిక్కుళ్లు)నాటుకోవాలి.
- మడికి ఉత్తరం లేదా దక్షిణ దిశలో తీగజాతి(బీర,అనప, కాకర) విత్తనాలు రెండు కుదళ్లలో నాటుకుని అదే దిశలో పందిరి వేసుకోవాలి.
- పందిరిని తూర్పు, పడమటి దిశలో వేసుకోవద్దు. దీని వలన మడిలో పెరుగుతున్న మొక్కలపై ఉదయం లేదా సాయంత్రం వేళలో నీడ పడితే అవి సాగిపోయి పెరిగి చీడ పీడలకు గురవుతాయి.
- ఐదు రకాల కూరగాయలను ఆయా కాలాలకు అనువైన రకాలను మాత్రమే పెంచుకోవాలి. లేకపోతే అనేక రకాల చీడ పీడలకు లోనై దిగుబడులు రాక నష్టపోతారు.

- పెరుగుతున్న మొక్కలపై ప్రతి 20 రోజులకు ఒకసారి ఏదైనా కషాయం లేదా నూనె ద్రావణాన్ని మార్చి చల్లుకోవాలి.
- కషాయాలు క్రిమి కీటకాల నివారిస్తాయి. మొక్కలకు కావాల్సిన వివిధ అమైనో ఆమ్లాలను అందజేసి మొక్కలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- వరుసగా రెండు సార్లు ఒకే రకమైన ద్రావణాన్ని వాడకూడదు.

పంట మార్పిడి

- మడిలో ఒక రకమైన కూరగాయలు పండించిన తరువాత అదే రకమైన పంటను వేసుకోవద్దు.
- ఆకుజాతి పంటలను తీసి వేసిన మడిలో తిరిగి దుంపజాతిని,అది తీసి వేసిన మడిలో కాయ జాతిని,అదితీసి వేసిన మడిలో చిక్కుడు జాతిని, దాని స్థానంలో ఆకుకూరలు నాటుకోవాలి.
- ఎంట మార్పిడి వలన మొక్కలకు పోషక పదార్థాలు సమర్థిగా అందుతాయి. తీగ జాతి కూరల కుదుళ్లను ఉత్తర, దక్షిణ దిశల్లో మార్చి పెట్టుకోవాలి.
- ప్రతి 25 అడుగుల స్థలంలో ఒక రకం కూరగాయ పంటను వేసిన తర్వాత తిరిగి రెండో పంట వేసేటపుడు మొదట్లో వేసిన విధంగానే సేంద్రీయ ఎరువులు, రొట్టలను 4వ వంతు తీసుకుని ఆభాగంలో కలుపుకోవాలి.
- 100 చ.అడుగుల చుట్టూ బంతి లేదా తులసి మొక్కలను నాటుకుంటే పురుగులు ఆశించకుండా పంటకు రక్షణగా ఉంటాయి.

సాయుధ పోరాట ఘనత కమ్యూనిస్టులదే

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరిని తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపు నిచ్చారు. పానగల్లులోని వీసా ఎలమంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు పెద్దగడియారం సెంటర్లో పెద్ద ఎత్తు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభకు సీపీఎం అఖిలభారత నాయకురాలు బృందకారత్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, నాగరాజు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శాపల్లిలో గల సాయుధ పోరాట అమరవీరుడు నిమ్మనగోటి అర్వపల్లి స్మారక స్థూపానికి సోమవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బయ్యన్న మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులన్నారు. గ్రామీణ ప్రాంతాలను ఏకం చేసి ఆనాటి నైజాం నవాబు అరాచకాలను సంఘటితంగా ఎదురొడ్డేందుకు కమ్యూనిస్టులు త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు పెద్దులు, కట్ట రామచంద్రం, కొప్పు శ్రవణ్, కుమ్మరి శంకర్, దండు రవి, ఆమనగంటి ఐలయ్య, గాలి నర్సింహ్మా, దండు నాగరాజు, దండు శంకరయ్య, సైదులు, మహ్మద్, కృష్ణ, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



మునుగోడు : సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న పార్టీలు..

కేతేపల్లి : తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన నాటికి పుట్టని పార్టీలు నేడు సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన సాయుధ పోరాట యోధుడు పసునూరి వెంకటరెడ్డి స్మారక స్థూపం వద్ద సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం దోపిడీదారులకు, దోపిడీకి గురవుతున్న వారికి మధ్య సాగిందన్నారు. అలాంటి పోరాటాన్ని కొన్ని పార్టీలు మతాల మధ్య పోరుగా సాయుధ పోరాటాన్ని అభివర్ణించడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు. మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, కోట లింగయ్య, చెరుకు సత్తయ్య, కర్ర బాలయ్య, సీహెచ్.నాగయ్య, ఎ.సుధీర్, నీలం సైదులు పాల్గొన్నారు.



కేతేపల్లి : కాసనగోడులో వెంకటరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం తగదు

మునుగోడు : తెలంగాణలో నాడు సాగిన అరాచక పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన సాయుధ రైతాంగ పోరాటం ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. సోమవారం మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి చరిత్రను వక్రీకరించడం కోసం కేంద్రంలో అఈధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిచడం తగదని ఆయన ఖండించారు. ఈనెల 17 జిల్లా కేంద్రంలో నిర్వహించే సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మిర్యాల భరత్‌కుమార్, యాసరాణి శ్రీను, వేముల లింగస్వామి, వడ్లమూడి హనుమయ్య, కట్ట లింగస్వామి, కొంక రాజయ్య, నరేష్, శివ, యాట శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలుడికి అభిషేకం



వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి పవళింపు సేవ నిర్వహిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తికి ఘనంగా పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు కారంపూడి కృష్ణమాచార్యులు, వేణాచార్యుల అర్చకత్వంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కన్నయ్య డోలారోహణ కార్యక్రమాన్ని ఆద్యంతం కన్నుల పండువగా నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు జెరిపోతల భరత్ దాతగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వేడుకలో దేవస్థానం చైర్మన్ దోసపాటి ప్రసాద్, అయితరాజు రమేష్, సామ కొండల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, జెనిగె బిక్షం, దోసపాటి రఘు, బండారు రమేష్, పసునూరి రమేష్, సత్తి, దూదిమెట్ల స్రవంతి, బొక్క కనకమ్మ, మంజుల, పద్మ, సబిత పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరారెడి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సోమవారం తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడా రు. రాష్ట్రంలో సుమారు 12 లక్షల మంది రవాణారంగ కార్మికులు సరుకు, ప్రజా రవాణా చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. అలాంటి కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, పోలే సత్యనారయణ, మారయ్య, సతీష్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పెంజర్ల సైదులు, సీహెచ్ లక్ష్మీనారాయణ, కోశాధికారి భీమగాని గణేష్, ఉపాధ్యక్షులు మల్లు గౌతమ్‌రెడ్డి, అద్దంకి నర్సింహ, జోసెఫ్, సహాయ కార్యదర్శులుగా వి.రాములు, వెంకటేష్, శంకర్, ఆదిమల్ల సుధీర్‌తో పాటు మరో 9 మందిని ఎన్నుకున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు
చేనేత హస్తకళలు ప్రతీక

● మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి చేనేత హస్తకళల స్టాల్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు చేనేత హస్తకళలు ప్రతీకలని మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శివాజీనగర్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ప్రదర్శన విక్రయాలను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్వాహకులు పవన్‌కుమార్ మోదీ, రాణికుమారీ మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో చేనేతవస్త్రాలు సంబంధించి, పొందూరు, చేబ్రోలు, పోచంపల్లి, పాడ్డుటూరు, మంగళగిరి, గద్వాల, చీరాల, ఢిల్లీ, చందేరి, బెంగాలీ, బెనారస్, కోట బాంబే, రెడీమేడ్స్, కలంకారీ, శారీస్ డ్రెస్ మెటీరియల్స్, బెడ్ షీట్స్ తదితరులతో పాటు హస్తకళలకు సంబంధించి కొండపల్లి, ఏటిపాక బొమ్మలు హైదరాబాద్ నుంచి ముత్యాలు, గ్రామ ఉద్యోగ ఆయుర్వేద ఔషధాలు, లెదర్ బ్యాగులు, మైసూర్ రోజ్ ఉడ్ ప్యానల్స్ తదితరాలను ప్రదర్శన, అమ్మకం కోసం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వంగాల అనిల్‌రెడ్డి, స్టాల్స్ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన జీపీవోలు

కేతేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఇటీవల నియమించిన గ్రామ పాలనాధికారులు(జీపీవో)లు కేతేపల్లి మండలంలో విధుల్లో చేరారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు ఆరుగురు జీపీవోలు నియమితులయ్యారు. ఒక్కొక్కరికి రెండు, మూడు గ్రామాల చొప్పున విధులను తహసీల్దార్ రమాదేవి అప్పగించారు. గుడివాడ, కాసనగోడు, బొప్పారం గ్రామాలకు జీపీవోగా ఎండీ.మహ్మద్ అలీ, ఉప్పలపహాడ్, కొప్పోలు గ్రామాలకు ఆర్.సైదులు, మండల కేంద్రం కేతేపల్లి, కొత్తపేట, చీకటిగూడెం గ్రామాలకు టి.సరిత, భీమారం, తుంగతుర్తి గ్రామాలకు వై.రాధ, చెరుకుపల్లి, బండపాలెం గ్రామాలకు ఎం.మ ధు, ఇనుపాముల, కొర్లపహాడ్ గ్రామాలకు జీపీవోగా ఐ.డానియల్ నియమితులయ్యారు. జీపీవోలుగా విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టిన వీరికి తహసీల్దార్ రమాదేవి తగిన సలహాలు, సూచనలు చేశారు.

● మర్రిగూడ: మర్రిగూడ మండల రెవెన్యూ క్లస్టర్ల నూతన గ్రామ పాలన అధికారుల నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 8 రెవెన్యూ క్లస్టర్ల పరిధిలో మొహమ్మద్ నజీరుద్దీన్, నూనె జనార్ధన్, ఎడ్ల గిరి, పోలే మహబూబ్, కాసారపు రవి, పొట్ట కళ్యాణి, రాజవర్ధన్‌రెడ్డిలను జీపీవోలుగా నియమితులయ్యారు. ప్రస్తుతం యర్గండ్లపల్లి గ్రామానికి నియమితులైన రెవెన్యూ క్లస్టర్ గ్రా మ పాలన అధికారి రాజవర్ధన్ రెడ్డిని డిప్యూటేషన్ మీద దేవరకొండకు వేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. నేటినుంచి ఆయా గ్రామాల్లో రెవెన్యూ క్ల స్టర్ నూతన గ్రామపాలన అధికారులుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలి

రామగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఈ నెల 17వ తేదీన విశ్వబ్రాహ్మణ వసతిగృహంలో నిర్వహించే విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని అధ్యక్షుడు కాసోజు శంకరాచారి కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక కల్యాణార్థమై ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో యజ్ఞ కమిటి నాయకులు రాగిఫణి విష్ణుమూర్తి, కూరెళ్ల రమణాచారి, కూరెళ్ల వెంకటేశ్వర్లు, కాసోజు శంకరాచారి, చొల్లేటి లక్ష్మణాచారి ఉన్నారు.

భారతావనిని ఏకం చేసిన హిందీ

చిట్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశాన్ని ఏకం చేయడానికి హిందీ భాష తోడ్పడిందని చిట్యాల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సుశీల తెలిపారు. పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృభాషతో పాటు అవసరమున్న ఇతర భాషలను కూడా నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హిందీ అభ్యాసన సామగ్రి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలక రాజు శ్రీనివాస్, పద్మజ, కోణం శ్రీనివాస్, ఇందిర, సైదులు పాల్గొన్నారు.

భవననిర్మాణ సంఘం కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం చిట్యాల మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుక్క నర్సింహ, కార్యదర్శిగా వడ్డెపల్లి శంకర్, ఉపాధ్యక్షులుగా దోర్నాల సంజీవ, చిర్రబోయిన గట్టయ్య, సహాయ కార్యదర్శులుగా వలిగొండ పరమేష్, బాతరాజు గోపాల్, కోశాధికారిగా వెంకన్న ఎన్నికయ్యారు.

తెల్లబంగారంపై ఆశలు ఆవిరి

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలోని పలు మండలాల్లో తెగుళ్లు కన్పించగా, అది జిల్లాలోని మిగతా ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. తెగుళకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే కొంతలో కొంతైనా దిగుబడి వస్తుంది. లేదంటే ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.



ఎర్ర గుమ్మడి సోకిన పత్తిచేను

తామర, ఎర్రనల్లి తెగుళ్లు ఉధృతి

పత్తి పంటలో తామర, ఎర్రనల్లి తెగుళ్ల ఉధృతి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఎర్రనల్లితో ఆకుల రంగు మారి ముడతపడుతున్నాయి. పూత, కాత రాలిపోతోంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గనుంది. ఎర్రనల్లి ఆకుల పెరుగుదలపై ప్రభావం చూపుతోంది. అదేవిధంగా పత్తిచేలు బలహీనంగా మారిపోతున్నాయి. తామర పురుగులతో పంట తీవ్రంగా దెబ్బతింటోంది. ఈ పురుగులు ఆకుల అడుగుభాగంలో ఉండి రసాన్ని పీల్చుతున్నాయి. దీంతో ఆకులు ముడతలు పడి పెళుసుగా మారుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కూడా తెగుళ్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పురుగుల వల్ల పత్తిలో తలమాడే తెగులు ఆశించి చేలు వాడిపోతున్నాయి. మర్రిగూడ మండలంలో పలు గ్రామాల్లో ఎర్రగుమ్మడి తెగులుతో కాయలు రాలిపోతున్నాయి. ఆకులు పసుపురంగులోకి మారుతున్నాయి. ఈ తెగుళ్ల నివారణ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు మునుగోడు మండలంలోని పలు గ్రామాలల్లో పర్యటించి పత్తిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మునుగోడు మండలంలోని పలు మండలాల్లో తామర, ఎర్రనల్లి వంటి పురుగులు ఆశించాయని అధికారులు స్పష్టం చేశారు. యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే ఎర్రనల్లి, తామరతో పూత, కాత రాలడాన్ని నివారించవచ్చని వారు చెబుతున్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లాలోని కొన్ని మండలాల్లో తామర, ఎర్రనల్లి, రసం పీల్చే పురుగులు ఉన్నట్లు శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు గుర్తించారు. దీంతో ఇప్పటికే శాస్త్రవేత్తలు, అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. తామర, ఎర్రనల్లి వంటి రసం పీల్చే పురుగుల నివారణ కోసం ప్రిపోనిల్, అసిటామిక్లోఫిడ్ 400గ్రాములు లేదా డిఫంతి యురాన్ 400మి.లీలు లేదా క్లోర్ ఫెనాపైర్ 300మి.లీలు, అజాక్సిస్ట్రోబిన్ 200మి.లీ, వేపనూనె 1500పీపీఎం, టీ-స్ట్రేన్ ఒక లీటర్ చొప్పున నీటిలో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేయాలి. దీంతో తెగుళ్లను నివారించవచ్చు.

\- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

ప్రజలకు చేరువవుతున్న లయన్స్ క్లబ్ సేవలు

కట్టంగూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధి గా ముందుకెళ్తున్న లయన్స్ క్లబ్ సేవలు గ్రామీణ ప్రజలకు ఎం తో చేరువయ్యాయని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్, లయన్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతీరోజు లక్షలాది మందికి సేవలు అందుతున్నాయన్నారు. కట్టంగూర్ క్లబ్ ప్రెసిడెంట్ చిక్కు శేఖర్, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పోగుల రాములు, ఉపాధ్యక్షులు రెడ్డిపలి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లుతో పాటు క్లబ్ కార్యవర్గాన్ని ఇన్స్టాలేషన్ ఆఫీసర్, పాస్ట్ జిల్లా గవర్నర్, జీఎస్టీ కోఆర్డినేటర్ లయన్ గోలి అమరేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయనిజం చేరిన ప్రతీ సభ్యుడు పేదలకు సేవ చేయడంలో ముందు ఉండాలన్నారు. కట్టంగూరు లయన్స్ క్లబ్ మండలంలోని ప్రజల అవసరాలు గుర్తించి, సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండెక్షన్ ఆఫీసర్, జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ లయన్ కేవీ ప్రసాద్, జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ లయన్ కోడె సతీష్‌కుమార్, జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ గట్టుపల్లి అశోక్‌రెడ్డి, రీజనల్ చైర్మన్ కొండ సంతోష్, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే, కంటి ఆస్పత్రి చైర్మన్ దోసపాటి గోపాల్, జోన్ చైర్మన్లు బుడిగె శ్రీనివాస్, కొండపల్లి లక్ష్మారెడ్డి, జిల్లా జీఈటీ మెంబర్ ఎర్ర శంభు లింగారెడ్డి, డిస్ట్రిక్ చైర్ పర్సన్ డెంకల సత్యనారాయణ, దేవరశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కట్టంగూర్ క్లబ్ జీఎంటీ కోఆర్డినేటర్ చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన కక్కిరేణి నవీన్ బాడీ ఫ్రీజర్ బాక్స్, ఆరుగురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌ల సభ్యులు కందాల పాపిరెడ్డి, నెమరుగొమ్ముల రామ్మోహన్, అంజిరెడ్డి, రేపాల సతీష్, కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, వినోద్‌కుమార్, గుజలాల్ శేఖర్‌బాబు, దామెర్ల శ్రీనివాస్, గుండు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న క్లబ్ సభ్యులు

సీఐటీయూ మండల కన్వీనర్‌గా సుధాకర్

గట్టుప్పల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా కర్నాటి సుధాకర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా కర్నాటి సుధాకర్, కన్వీనర్, కమిటీ సభ్యులుగా కక్కునూరి రాము, బొబ్బల చంద్రయ్య, కక్కునూరు నరసింహ, విడం లలిత, నీళ్ల జ్యోతి, బీమగాని భవాని, దుబాక శంకరయ్య, వీరమల్ల భిక్షం, ఏర్పుల సైదులు, చిన్నమల్ల ముత్తయ్య, దోటి సుమిత్ర, పసుపుల చెన్నయ్య, బండారు నరేష్, పగడాల రాజు, బీమగాని రవి, పెదగాని నగేష్, లక్ష్మీనారాయణలను ప్రకటించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు వరికుప్పల ముత్యాలు, ఏర్పుల యాదయ్య, నాయకులు ముసుకు బుచ్చిరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



సుధాకర్

పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి



పేదలకు కేటాయించిన భూమని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నాంపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలం గట్లమల్లేపల్లిలో ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి డిమాండ్ చేశారు. మండలంలోని గట్లమల్లేపల్లిలో సోమవారం పేదలతో కలిసి ఆయన భూములను పరిశీలించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వేనెంబర్ 6, 7లో నాలుగు ఎకరాల భూమిని ఇంటి స్థలాల కోసం పేదలకు కేటాయించారని అన్నారు. కాని కొంతమంది నాయకులు ఆ భూమిని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని కోరుతున్నారని తెలిపారు. పేదలకు కేటాయించిన భూమి వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఇరిగి వెంకటయ్య, దశరథరెడ్డి, నర్సింహ, లబ్ధిదారులు నిరంజన్, పెద్దులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచి ఇవ్వాలి

ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు



నల్లగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పింఛన్‌దారులు

నల్లగొండటౌన్, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, మర్రిగూడ, కట్టంగూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ వెంటనే అమలు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెరిక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్, ఎమ్మెస్పీల ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు కావొస్తున్నా హామీని అమలు చే యడం లేదని విమర్శించారు. పింఛన్ల మీద ఒక్కమాట కూడా మాట్లాడకుండా మోసం చే శారని అన్నారు. మోసం చేసిన సీఎం వెంటనే రాజీనామా చేయాలని, ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కాదన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇ చ్చిన పిలుపులో భాగంగా దివ్యాంగులు, చేయూత పింఛన్ తీసుకునే వా రితో తహసీల్దార్ కార్యాలయం ముట్టడించామని, పింఛన్లు పెంచే వరకు పోరాటం ఆగదని అన్నారు. అనంతరం ఆయా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

● నల్లగొండలో వీహెచ్‌పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, పట్టణ అధ్యక్షుడు మాసారం వెంకన్న, వీహెచ్‌పీఎస్ నాయకులు చిలుముల జలందర్ మచ్చ గిరి, బుర్ర నాగయ్య, నరేష్, ఈదయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ నాయక్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నక్క అశోక్, కొమ్ము శ్రీను, నాయకులు గడ్డం ఉపేందర్, చిక్కుల వెంకన్న, అచ్చిరెడ్డి, లింగస్వామి, సురేష్, నర్సింహ, రాములు, ఐలయ్య, లక్ష్మమ్మ, లింగమ్మ, మారమ్మ, దుర్గయ్య, భిక్షమయ్య, మారయ్య పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు బట్ట శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు బాకీ వెంకన్న, బట్ట చిన్న సైదులు, పనికర కమలాకర్, రాచకొండ గణేష్, బట్ట నరసింహ, మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు బట్ట యాదమ్మ, రాస్తాపురం పూలమ్మ, బట్ట వెంకమ్మ, బట్ట మల్లమ్మ, చిల్లంశెట్టి సుశీల, బట్ట ఫకీరు, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

● మర్రిగూడలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం హామీలను వెంటనే అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేష్, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మేతరి రాములు, పోలే కావేరి, మైలారపు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు, యాచారం శివకుమార్, ఎడ్ల జంగయ్య, యాదయ్య, నరసింహ, వెంకటయ్య, జయమ్మ, రాధా, భారతమ్మ, భాగ్యమ్మ, రాజమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

● కట్టంగూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు రత్నం ఎల్లయ్య, దాసరి ప్రవీణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.69 (305.8626)	50,685	50,685
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.73 (4.13)	5,331.27	6,019.17
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.061)	37,597	32,751

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



ఎంజీయూలో పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్, తదితరులు



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎంజీయూ జాతీయ స్థాయికి ఎదగాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అట్టహాసంగా ఎంజీయూ నాలుగో స్నాతకోత్సవం
- 22మందికి పీహెచ్‌డీ, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ ప్రాంతంలో ఉన్న మహాత్మాగాంధీ యూనివర్సిటీ జాతీయస్థాయి విద్యా సంస్థగా ఎదగాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. సోమవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో 22 మందికి పీహెచ్‌డీ పట్టాలను, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ఛాన్స్‌లర్ హోదాలో గవర్నర్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యా సంస్థలను కేవలం నిర్మాణాలుగా చూడవద్దని, సమాజంలో విలువలు, శ్రేష్ఠత కోసం నిరంతర ప్రయత్నాల ద్వారా రూపొందించిన జీవన వ్యవస్థలుగా చూడాలన్నారు. అకడమిక్, పరిశోధనలు, ఆవిష్కరణలు, సేవా కార్యక్రమాల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ మంచి ఫలితాలు సాధిస్తోందని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి యూనివర్సిటీ తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. చాలామంది తొలితరం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఇక్కడికి పలు సవాళ్ల నడుమ వచ్చి ఉంటారని, విద్యార్థులందరినీ అక్కున చేర్చుకొని వారి జీవన ఎదుగుదలకు యూనివర్సిటీ వేదికగా నిలుస్తున్నందుకు గర్వపడుతున్నామన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతూ వారేంటో నిరూపించుకుంటూ దేశానికి చక్కటి వనరుగా మారుతున్నారని కొనియాడారు. విద్యార్థుల హాజరుశాతం పెంచడం, మెరుగైన హాస్టళ్ల సదుపాయాలు కల్పించడం, క్యాంపస్‌లో లైబ్రరీ, స్పోర్ట్స్ విభాగాలు అందుబాటులో ఉంచి సమాజానికి ఉపయుక్తమైన విద్యార్థులను అందించడానికి తోడ్పడుతున్న యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది ప్రశంసనీయులని అన్నారు. ఎంజీయూను మరింతగా బలోపేతం చేసేందుకు, జాతీయస్థాయి విద్యాసంస్థగా

- మిగతా 7వ పేజీలో...



తెల్ల బంగారంపై ఆశలు ఆవిరి

జిల్లాలో జూన్, జూలైలో వర్షాలు కురియకపోవడంతో బెంగపెట్టుకున్న రైతులు ఆ తరువాత ఆగస్టు మొదటి వారంలో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తారు. అవి మొలకెత్తి ఏపుగా పెరగడంతో ఆనందపడ్డారు. అయితే తెగుళ్ల ఉధృతి కారణంగా తెల్లబంగారంపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా? రావా? అనే ఆందోళనలో రైతులు ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- పత్తి చేలల్లో తామర, ఎర్రనల్లి తెగుళ్ల ఉధృతి
- రసం పీల్చే పురుగులతో దిగుబడులపై ప్రభావం
- పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా? అనే సందిగ్ధం
- ఆందోళనకు గురవుతున్న పత్తి రైతులు

ఎకరానికి దుక్కులు దున్నడం మొదలు విత్తనాలు, ఎరువులు, కూలీలు, మొత్తం కలిపి రూ.25వేలకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాలు ఆలస్యంగా కురియడంతో విత్తనాలు ఆలస్యంగా విత్తిన రైతులు పత్తిచేల ఎదుగుదలను చూసి దిగుబడులకు ఢోకా లేదని భావించారు. దీనికి తోడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అతి వృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధికంగా ముసురుతో కూడిన వర్షాలే ఉండటంతో పెద్దగా ప్రయోజనం లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఈనెల 15 వరకు సాధారణ వర్షపాతం 404.8మి.మీలకు 496.5మి.మీల వర్షం కురిసింది. 23మి.మీలు అధికంగానే వర్షపాతం నమోదైనా ముసురు కారణంగా పెద్దగా ప్రయోజనం కలగలేదు. జిల్లాలోని 33 మండలాలకు 14 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని అధికారులు లెక్కలు చెబుతుండగా, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతమే ఉంది. జిల్లా యూనిట్‌గా 23మి.మీలు అధిక వర్షపాతం నమోదైందని లెక్కలు చెబుతుండగా, గ్రామాల వారీగా లెక్కల నమోదుకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పరికరాలు లేక మండలాలు యూనిట్లుగా తీసుకుంటున్నారు. దీంతో క్షేత్రస్థాయి భిన్న పరిస్థితులు కన్పిస్తున్నాయి.

5.68లక్షల ఎకరాల్లో పత్తి విస్తీర్ణం

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5.68లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది 20వేల ఎకరాల్లో అదనంగా సాగైంది. వేసవి దుక్కుల్లో వేసిన విత్తనాలు మే నెలలో విత్తగా, చాలా చోట్ల వర్షాలు లేక మొలకెత్తలేదు. ఆ తరువాత జూన్, జూలైలో అడపాదడపా కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తినా, తీరా వర్షాలు రాక కొందరు రైతులు మూడుసార్లు విత్తనాలు విత్తి రైతులు నష్టపోయారు. అయితే ఆగస్టులో కురిసిన వర్షాలకు మాత్రం మొక్కలు నిలదొక్కుకొని బయటపడ్డాయి. అయితే ఎరువులను పెద్ద మొత్తంలో వినియోగించడంతో పత్తిచేలు ఏపుగా పెరిగాయి. వాస్తవానికి పంట దిగుబడి ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి వస్తే రైతులకు లాభాలు వస్తాయి. కానీ ప్రస్తుతం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. తొలుత మునుగోడు

- మిగతా 8వ పేజీలో...

పత్తికి ఎర్ర గుమ్మడి తెగులు

(ఆంధ్రజ్యోతి, మర్రిగూడ): మర్రిగూడ మండలంలో ఈ సీజన్‌లో రైతులు 21,800 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. పంట ఏపుగా పెరిగి చెట్టుకు 25 నుంచి 35 వరకు గూడ (కాయ) వచ్చింది. అయితే ఆగస్టు మాసంలో స్వల్ప వర్షాలు కురిసినా, తీవ్ర ఎండల కారణంగా పత్తిని ఎర్ర గుమ్మడి తెగులుకు ఆశించింది. మండలంలోని తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి, అజిలాపురం, ఎర్రగండ్లపల్లి, మర్రిగూడ, రామ్‌రెడ్డిపల్లి, బట్లపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో 9వేల ఎకరాల వరకు పత్తి ఎండిపోయింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పత్తి ఎదిగినప్పటికీ అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల పురుగు చావకుండా ఎదగడంతో ఎర్ర గుమ్మడి తెగులు వ్యాపించిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రైతులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్, బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులను బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాపై బీఆర్ఎస్ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియాను పక్కదారి పట్టించినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించలేదని స్పష్టం చేశారు. కుక్కడం రైతుల అవసరం మేరకు అక్కడికి ఎక్కువ యూరియా సరఫరా చేశారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా కేటీఆర్ దీనిపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 15 రోజుల క్రితం జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తుందన్నారు. దీనిపై తాము కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం లేదని, బీజేపీ నాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో 5.68లక్షల ఎకరాల్లో పత్తి, 5.38 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, గతం కంటే పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. గత ఏడాది జిల్లాలో 57వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయగా, ఈసారి ఇప్పటివరకు 61 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లాకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా అవుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో నల్లగొండ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, వంగాల అనిల్‌రెడ్డి, గాలి నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, గాదరి రవి, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలికిన బీజేపీ నాయకులు



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి శాలువాలతో సత్కరించారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గూడూరి నారాయణరెడ్డి, ఫకీరు మోహన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, పోతపాక లింగస్వామి, బండారు ప్రసాద్, గడ్డం మహేష్, మిర్యాల వెంకటేశం, బొజ్జ నాగరాజు, బోగరి అనిల్‌కుమార్, పిన్నింటి నరేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

క్రెడాయి రాష్ట్ర కార్యదర్శి బండారు



ఇంజనీర్లను సన్మానిస్తున్న బండారు ప్రసాద్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని క్రెడాయి రాష్ట్ర కార్యదర్శి బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మోక్షగుండ విశ్వేశరయ్య జయంతి సందర్భంగా నల్లగొండ క్రెడాయి చాప్టర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంజనీర్లు నైపుణ్యంతో కట్టిన ప్రాజెక్టులు, భవనాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ఎదురైన క్లిష్ట సమస్యల పరిష్కారానికి ఇంజనీర్లు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా నల్లగొండ మునిసిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఈఈ వెంకటేశ్వర్లు, నాంపల్లి మనోహర్, దిలీప్ భార్గవ్, ఎం.రామరావు, అల్లి మల్లికార్జున్, ఆవుల శ్రీనివాస్, పృథ్వీరాజ్, బొడ్డుపల్లి సతీష్, అలుగుబెల్లి వేణుగోపాల్, మిట్టపల్లి సాయి సంతోష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆమంచి రాజలింగం, దూదిపాల వెంకట్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్, మదుసూదన్‌రెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో: జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

రోడ్డెక్కిన రైతులు



పెద్దవూరలో జాతీయ రహదారి ధర్నా చేస్తున్న రైతులు

పెద్దవూర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు సరిపడా యూరియా సరఫరాచేయాలని రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద రైతులు పాస్‌పుస్తకాలు ఉంచి రోజులుగా ఎదురు చూసినా యూరియా దొరక్కపోవడంతో రైతులు సోమవారం కోదాడ-జడ్చర్ల రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, యూరియా కోసం రోజుల కొద్దీ ఎదురుచూస్తున్నామని, పాస్‌పుస్తకాలు క్యూలైన్‌లో ఉంచి పడిగాపులు కాసినా సోమవారం కొంతమంది రైతులకే యూరియా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ మేర ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వై.ప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో వారు శాంతించి ధర్నాను విరమించారు.

కేతేపల్లిలో తోపులాట

(ఆంధ్రజ్యోతి, కేతేపల్లి): ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు కీలక దశలో ఉండగా, మండలానికి 10 రోజులుగా యూరియా సరఫరా లేకుండా పోయింది. ఈ క్రమంలో సోమవారం స్థానిక పీఏసీఎస్‌కు మూడు లారీల్లో 1200 బస్తాల యూరియా వచ్చిందని తెలిసిన రైతులు పెద్ద సంఖ్యలో ఉదయాన్నే చేరుకున్నారు. పీఏసీఎస్ కార్యాలయం ఎదుట క్యూలో నిల్చున్నారు. రైతులు అధిక సంఖ్యలో రావడంతో మండల కేంద్రానికి చెందిన రైతులకు ఈ దఫా యూరియా ఇచ్చేందుకు పీఏసీఎస్ అధికారులు నిరాకరించారు. దీంతో క్యూలైన్‌లో కొంతసేపు తోపులాట జరగడంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పాస్‌పుస్తకాల ఆధారంగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయించారు. రైతుల అవసరాలు తీరాలంటే మరో మూడు నుంచి నాలుగు లోడ్ల యూరియా అవసరమని పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాడాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్

చండూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు చండూరులో రెండో రోజు సోమవారం కొనసాగాయి. 'మతం-మతోన్మాదం' అనే అంశంపై రమేష్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాల పేరుతో ప్రజల్లో చిచ్చులు పెడుతున్నారని ఆరోపించారు. విద్యారంగం కాషాయికరణ, మతోన్మాద బీజాలు నాటుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ కార్పొరేట్‌కు అప్పగించేందుకు కంకణం కట్టుకున్నాయన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువును అందని ద్రాక్షలా మారుస్తున్నారని విమర్శించారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ 'సోషలిజం విశిష్టత-వాటి ఆవశ్యకత' అనే అంశంపై ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ బాటలో నడుస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్, నవదీప్, జగన్‌నాయక్, జగదీష్, వీరన్న, ప్రసన్న, ప్రణీత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి సుధాకర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై యువతలో అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి, ఉమ్మడి జిల్లా ప్రోగాం మేనేజర్ సుధాకర్ అన్నారు. యూత్ ఫెస్ట్-2025లో భాగంగా సోమవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ డైట్ కళాశాలలో జిల్లా స్థాయి క్విజ్ నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఉమ్మడి జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ సంపతయ్య, ప్రేమనాథ్, లింగస్వామి పర్యవేక్షించారు. అనంతరం మొదటి స్థానంలో నిలిచిన చర్లపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, ద్వితీయస్థానంలో నిలిచిన ఆర్పీరోడ్ జీజీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులకు డీఈవో కార్యాలయ సిబ్బంది బాల బహుమతులు అందజేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ



వంగమర్తి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

శాలిగౌరారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో చెరువులు అలుగులు పోస్తుండటంతో మూసీ నదికి భారీగా వరద వస్తోంది. దీంతో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని ఉప్పలంచ, మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి గ్రామాల సరిహద్దు నుంచి మూసీ ఉధృతంగా ప్రవహిస్తూ జలాశయంలో కలుస్తోంది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ కీసరి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం నాగకృష్ణ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.20వేల ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో పలువురు లారీ డ్రైవర్లు ఉన్నారు.

పదోన్నతి పొందిన వారికి సన్మానం

హాలియా,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఎం.ఏ. హమీద్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ నుంచి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా, లోకేష్‌రెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ నుంచి లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. సోమవారం వారిని మండల పశువైద్యాధికారి మహిపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చాంద్, గోపాలమిత్రలు కోటేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో
అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పెద్దవూర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్‌ను పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండలంలోని వెల్మగూడెం జడ్పీహెచ్‌ఎస్ కేంద్రంలోని ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్‌ను సోమవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. అడ్మిషన్లకు ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గలవారు 8919350463 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్. శ్రీనివాస్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జి.హిమవంతరెడ్డి, హరీష్, మండల పంచాయతీ అధికారి మంగతాయారు, సూపరింటెండెంట్ హజీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మీషన్ పొందడానికి ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ఆగామోత్కూర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఏలేటి వినోద్‌కుమార్, సహాయ కోఆర్డినేటర్ నిమ్మనగోటి జనార్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కోసం ఆగామోత్కూర్ హైస్కూల్‌లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849262067, 9293738998 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

యూరియా దుర్వినియోగం కాలేదు

● ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్

మిర్యాలగూడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా లోడును పక్కదారి పట్టించి దుర్వినియోగం చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని మిర్యాలగూడ ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో ఆగస్టు 29న మార్క్‌ఫెడ్ అధికారులు మాడ్గులపల్లి మండలం కుక్కడం ఎన్‌డీసీఎంఎస్‌కు లారీ లోడు యూరియా మాత్రమే పంపామని, ఆ యూరియాను అధికారులు రైతులకు పంపిణీ చేశారని వెల్లడించారు. యూరియా పక్కదారి పట్టిందన్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. సమావేశంలో మాడ్గులపల్లి ఏవో శివరాంకుమార్, వేములపల్లి ఏవో కిషోర్‌నాయక్, దామరచర్ల ఏవో రుష్యేంద్రమణి, అడవిదేవులపల్లి ఏవో సరిత పాల్గొన్నారు.

గొడకొండ్లలో ప్రారంభమైన కృష్ణాష్టమి వేడుకలు



గొడకొండ్లలో పూజలు అందుకున్న మూలమూర్తులు

చింతపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం గొడకొండ్లలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ ఆచార ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్షేన పూజ, స్వస్తి పుణ్యావాచనంతో పాటు విగ్రహాలకు పంచమృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని తొట్టిలో వేసి పవళింపు పాటలతో పూజించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, కమిటీ చైర్మన్ అల్వాల జంయయ్యగౌడ్, ధర్మకర్తలు ఇడుకుళ్ల రాము, కడారి జంగయ్య, గ్యార ఉమా యాదయ్య, సురిగి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆల య సమీపంలో నిత్య పూజ చేయుటకు కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏ ర్పాటు చేసిన సెమెంట్ తొట్టిలో పూల మొక్కలు నాటారు. మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతుగా సహకారం అందిస్తామన్నారు.

యూరియా అందించడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి

వేములపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వరినాట్లు జోరుగా వేశారని, మరోవైపు బోరుబావుల ఆధారంగా వేసిన పంట పొలాలు పొట్ట దశకు వస్తున్నా యూరియా చల్లకపోవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా అందించడంలో విఫలమైన ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు కుంటి సాకులు చెప్పుకుంటున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అవసరమైన యూరియాను ఇవ్వకపోతే అందించాలని లేనిచో ఉద్యమన్నా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కోడిరెక్క వెంకన్న, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, బొమ్మగాని ఎల్లయ్య, వడ్డెగాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంలేకుండా చూడాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో చంద్రకళ

డిండి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూడాలని ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ అన్నారు. మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు పోషకాహార లోపానికి గురికాకుండా చూడాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఒక్కపూట సంపూర్ణ భోజనం అందిస్తూ వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రాథమిక విద్య, పోషక విలువల గురించి కిశోర బాలికలు ఎదుర్కొనే సమస్యల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రేణుక, రమణ, సుశీల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యువ వికాసమేదీ!



పెద్దఅడిశర్లపల్లి ఎంపీడీవో కార్యాలయం

- అయోమయంలో రాజీవ్ యువ వికాసం దర ఖాస్తుదారులు
- ఉమ్మడి మండలంలో 2136 దరఖాస్తులు
- అర్హులను ఎంపిక చేశామని గతంలోనే హడావుడి
- పథకం అమలుపై స్పష్టత కరువు
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు నోచుకోవడం లేదు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముగిసినా తుది జాబితాలను విడుదల చేయడం లేదు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లోన్ మంజూరు పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టగా చివరి నిమిషంలో వాయిదా పడింది. అయితే రాష్ట్ర మంత్రి వర్గంలోనూ ఏ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతనిరాశకు గురవుతుంది. ఉమ్మడి గుడిపల్లి,పీఏపల్లి మండలంలో 31 గ్రామపంచాయతీలు ఉండగా 2136 దరఖాస్తులు అందాయి. అందులో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 485 మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీ కార్పొరేషన్ 708, బీసీ కార్పొరేషన్ 889, మైనార్టీ కార్పొరేషన్ 51 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. మండలానికి ఇచ్చిన లక్ష్యం ప్రకారం రూ.50 నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందజేస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల వాయిదా వేయడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం ప్రకటన ఎప్పుడొస్తుందా అని చూస్తున్నారు.


లోతుగా విచారిస్తేనే..

రాజీవ్ యువవికాసం పథకానికి సంబంధించి ఉమ్మడి మండలంలో సుమారు 2 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో విచారణ చేసి అనర్హులను పక్కన పెట్టారు. బ్యాంకు పూచీకత్తు తర్వాత మండలస్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తుది జాబితాలు రూపొందించారు. ఈ పథకంలో రూ. 2 నుంచి రూ.4లక్షల వరకు వివిధ యూనిట్ల కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మరింత లోతుగా విచారణ చేసిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకూ పురోగతి లేదు. దీంతో అర్హులైన ఎంతో మంది ఆశగా ఎదురుచూస్తున్నారు.

అప్పట్లో హడావుడి..

రాజీవ్ యువవికాసం పథకం పేరుతో నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులను ఎంపిక చేశామని హడావుడి చేశారు. తీరా రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు మంజూరు పత్రాలు ఇస్తామన్నారు. నేటికీ పథకం ఊసే లేదు.

నిబంధనలు రాలేదు..



రాజీవ్ యువవికాసం పథకం గురించి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. అప్పట్లో ఉమ్మడి మండలంలో 2 వేల పై చిలుకు దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుటాం. అప్పటి వరకు వేచిచూడాల్సిందే.

\- చంద్రమౌళి, ఎంపీడీవో, పీఏపల్లి

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పట్టణంలో వివిధ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేసి, కళాశాలల బంద్ విరమింపజేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ కళాశాలల అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయని కారణంగా తమకు వేతనాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం చేతిలో విద్యార్థులతో పాటు తమ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చిదళ్ల యాదయ్య, బాలకృష్ణ, శ్రీనివాస్, శ్రీనాథ్, మధుసూదన్, నాగయ్య, అజయ్, హరి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

పలువురిని పరామర్శించిన ఎంపీ రఘువీర్‌రెడ్డి



దండ భాస్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

హాలియా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన బత్తుల తిరుపతయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, శంకర్‌నాయక్ అన్నారు. హాలియాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తిరుపతయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, నాయకులు పొదిల వెంకన్న, వెంపటి శ్రీను, కోట నాగిరెడ్డి, రావుల శ్రీనివాస్, బూడిద గోవింద్‌యాదవ్, తొడిందల రాజశేఖర్, జంపాల అరవింద్, వసంత్‌కుమార్, గోవింద్‌యాదవ్, ముత్తు, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భార్గవ్‌ను పరామర్శించిన ఎంపీ రఘువీర్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో సోమవారం పర్యటించిన ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాతృవియోగంలో ఉన్న మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్‌ను పరామర్శించారు. భార్గవ్ తల్లి మల్లీశ్వరమ్మ ఇటీవల మృతిచెందారు. రఘువీర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ, నాయకులు నర్సిరెడ్డి, సైదులు, పొదిల శ్రీను, స్కైలాబ్‌నాయక్ ఉన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన రిపోర్టర్ భాస్కర్ ఇంటికి చేరుకున్న ఎంపీ కుటుంబ సభ్యులను పరామర్శించి, భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హౌజింగ్‌బోర్డులో మేరెడ్డి రాంరెడ్డి కోడలు శిరీష మృతి చెందగా, ఐదో రోజు కార్యక్రమాలకు ఎంపీ హాజరయ్యారు.

భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం..

రిపోర్టర్ భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన భాస్కర్ సంతాపసభకు ఆయన హాజరై మాట్లాడారు. మీడియా రంగంలో సుదీర్ఘకాలం సేవలందించిన భాస్కర్ భార్య సునందకు ఏరియా ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానన్నారు. పిల్లల విద్యకు అవసరమైన సాయం అందిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీనివాసరావు, టీడీపీ క్రమశిక్షణ సమితి జాతీయ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తెవివే రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, కలిమెల నాగయ్య తదితరులు హాజరై భాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్



దేవరకొండలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండ బస్టాండ్ ఎదుట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, వీరయ్య, బిక్షమయ్య, దశరథగౌడ్, బాలస్వామి, ఖాదర్‌బాబా, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు కొండేటి వెంకట్ అన్నారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సంఘం నియోజకవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను గ్రామ, గ్రామాన కన్నుల పండువగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొండ్రపల్లి నగేష్, నాయకులు సకిలినేని జీవ, కృష్ణ, వెంకటయ్య, అనిల్‌కుమార్, సాలయ్య, శ్రీకాంత్, ముత్యాలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవాపక్షాన్ని విజయవంతం నిర్వహించాలి

చందంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సేవాపక్షాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుంటోజు వినోదచారి అన్నారు. మండలంలోని పోలేపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వరకు నిర్వహించే సేవాపక్షం కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. పార్టీ జాతీయ కమిటీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా 15 రోజులు మహనీయుల జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలను ప్రతీ గ్రామంలో విధిగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్ము వెంకటయ్య, పాత్లావత్ ఆంజనేయులు, జింకల శ్రీశైలం, శివ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు పెంచి ఇవ్వాలి



చందంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన పింఛన్‌దారులు

వేములపల్లి, చందంపేట, తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేల పింఛన్ వెంటనే అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు పాల్వాయి సుధాకర్, పుట్టల నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు కావొస్తున్నా హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. పెరిగిన ధరలకు దివ్యాంగులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. దివ్యాంగులు, వితంతులు, వృద్ధాప్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని పింఛన్లను పెంచి అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో మందకృష్ణమాదిగ ఆ ధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఆయా తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

● వేములపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకన్న, వైకుంఠాచారి, సుజాత, వెంకటమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్టల సందీప్, మొండికత్తి వీరస్వామి, అవిరెండ్ల నర్సయ్య పాల్గొన్నారు.

● చందంపేటలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీరామదాసు వెంకటచారి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ల్లో భాగంగా పింఛన్లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, పచ్చిపాల కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండలు, నాయకులు పోలేని యాదయ్య, గార్లపాటి ప్రసాద్, ఏర్పుల వెంకటయ్య, రాంబాబు, శంకర్‌నాయక్, రాములు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు వస్కుల శ్రీనుమాదిగ, వస్కుల యాదయ్య, వస్కుల ఇద్దయ్య, అందుగుల జానయ్య, వస్కుల బాలకృష్ణ, ఎలిమినేటి అజయ్, అందుగుల శ్రీను, పంది అంజయ్య, వెంకటయ్యయాదవ్, సత్తయ్య పాల్గొన్నారు.

తెల్లబంగారంపై ఆశలు ఆవిరి

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలోని పలు మండలాల్లో తెగుళ్లు కన్పించగా, అది జిల్లాలోని మిగతా ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. తెగుళకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే కొంతలో కొంతైనా దిగుబడి వస్తుంది. లేదంటే ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

తామర, ఎర్రనల్లి తెగుళ్ల ఉధృతి

పత్తి పంటలో తామర, ఎర్రనల్లి తెగుళ్ల ఉధృతి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఎర్రనల్లితో ఆకుల రంగు మారి ముడతపడుతున్నాయి. పూత, కాత రాలిపోతోంది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గనుంది. ఎర్రనల్లి ఆకుల పెరుగుదలపై ప్రభావం చూపుతోంది. అదేవిధంగా పత్తిచేలు బలహీనంగా మారిపోతున్నాయి. తామర పురుగులతో పంట తీవ్రంగా దెబ్బతింటోంది. ఈ పురుగులు ఆకుల అడుగుభాగంలో ఉండి రసాన్ని పీల్చుతున్నాయి. దీంతో ఆకులు ముడతలు పడి పెళుసుగా మారుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు కూడా తెగుళ్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పురుగుల వల్ల పత్తిలో తలమాడే తెగులు ఆశించి చేలు వాడిపోతున్నాయి. మర్రిగూడ మండలంలో పలు గ్రామాల్లో ఎర్రగుమ్మడి తెగులుతో కాయలు రాలిపోతున్నాయి. ఆకులు పసుపురంగులోకి మారుతున్నాయి. ఈ తెగుళ్ల నివారణ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు మునుగోడు మండలంలోని పలు గ్రామాలల్లో పర్యటించి పత్తిలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మునుగోడు మండలంలోని పలు మండలాల్లో తామర, ఎర్రనల్లి వంటి పురుగులు ఆశించాయని అధికారులు స్పష్టం చేశారు. యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే ఎర్రనల్లి, తామరతో పూత, కాత రాలడాన్ని నివారించవచ్చని వారు చెబుతున్నారు.



ఎర్ర గుమ్మడి సోకిన పత్తిచేను

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



జిల్లాలోని కొన్ని మండలాల్లో తామర, ఎర్రనల్లి, రసం పీల్చే పురుగులు ఉన్నట్లు శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు గుర్తించారు. దీంతో ఇప్పటికే శాస్త్రవేత్తలు, అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు చేస్తున్నారు. తామర, ఎర్రనల్లి వంటి రసంపీల్చే పురుగుల నివారణ కోసం ఫ్రిపోనిల్, అసిటామిక్లోఫిడ్ 400గ్రాములు లేదా డిఫంతి యురాన్ 400మి.లీలు లేదా క్లోర్ ఫెనాపైర్ 300మి.లీలు, అజాక్సిస్ట్రోబిన్ 200మి.లీ, వేపనూనె 1500పీపీఎం, టీ-స్ట్రేన్ ఒక లీటర్ చొప్పున నీటిలో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేయాలి. దీంతో తెగుళ్లను నివారించవచ్చు.

\- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ